## సీడీఎఫ్‌డీ నోటిఫికేషన్ విడుదల

**జూన్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలి**

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): లైఫ్ సైన్సెస్ రంగంలో పారిశ్రామికవేత్తగా ఎదిగే ఆలోచనతో ఉన్న ఔత్సాహికులకు సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నది. లైఫ్ సైన్సెస్ రంగంలో స్టార్టప్‌లను ప్రారంభించాలని భావించే వారికి అనుకూలంగా సీడీఎఫ్‌డీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో చేరేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇండస్ట్రీయల్ బయోటెక్నాలజీ, హెల్త్ టెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ, అగ్రికల్చర్ టెక్నాలజీ, బయోఇన్‌ఫర్మేటిక్స్ వంటి విభాగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఇంక్యుబేషన్ సేవలు ప్రారంభించింది. సీడీఎఫ్డీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో చేరిన స్టార్టప్‌లకు కోవర్కింగ్ ల్యాబ్, ఆఫీస్ స్పేస్‌తో పాటు హై ఎండ్ ఎక్విప్‌మెంట్, ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, మెంటార్‌షిప్, నెట్‌వర్కింగ్ అండ్ మార్కెట్ లింకేజ్, ఫండ్ రైజింగ్ అసిస్టెంట్ వంటి సదుపాయాలను కల్పించనున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జూన్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

# కాంట్రాక్టర్లు ససేమిరా..

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్ల పోరు రోజురోజుకు ఉధృతమవుతున్నది. ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహణ పనులన్నీ నిలిపివేసి సమ్మెలోకి వచ్చి తమ నిరసన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. రూ.1350 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేసేంత వరకు నిర్వహణ పనులు చేపట్టబోమంటూ అల్టిమేటం జారీ చేసి.. 'వీ వాంట్ పేమెంట్స్' పేరుతో సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గడిచిన ఆరు రోజులుగా రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు ఎక్కడికక్కడ నిల్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే మాన్‌సూన్ అత్యవసర పనులు ఐఆర్టీని నిలిపివేస్తామని జీహెచ్‌ఎంసీకి కాంట్రాక్టర్లు హెచ్చరించారు. దీనిపై కమిషనర్ రొనాల్డ్‌రాస్ సైతం కాంట్రాక్టర్లను నిధులు విడుదల సక్రమంగా జరుగుతున్నదని, ఐఆర్టీ పనులు నిలిపివేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే రూ.57కోట్లను విడుదల చేసిన జీహెచ్‌ఎంసీ...గురువారం కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో ఈఎన్సీ జియావుద్దీన్ సమావేశమయ్యారు. రెండు నెలలకు సంబంధించి పేమెంట్ రిలీజ్ చేస్తామని ఈఎన్సీ కాంట్రాక్టర్లకు తెలిపారు. ఇందుకు కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. బకాయిలు మొత్తం చెల్లించే వరకు బంద్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లు ఎవరికి తగ్గకుండా బెట్టు మీద ఉండటంతో రాబోయే వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే సమస్యలపై ప్రజలు బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి. రాబోయే రోజుల్లో ఈ కాంట్రాక్టర్ల సమస్యకు పరిష్కారం చూపకపోతే ప్రజా సమస్యలు ఎక్కువగా అయ్యే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతున్న తరుణంలో అధికారుల వైఖరీ ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.!!



కాంట్రాక్టర్లతో మంతనాలు జరుపుతున్న అధికారులు

**జీహెచ్‌ఎంసీలో ఉధృతమవుతున్న కాంట్రాక్టర్ల పోరు**

**రెండు నెలలకు సంబంధించి పేమెంట్స్ రిలీజ్ చేస్తామన్న ఈఎన్సీ జియావుద్దీన్**

# జూన్ 7లోపు యూనిఫాం ప్రక్రియ పూర్తి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): జూన్ 7వ తేదీలోగా విద్యార్థుల స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ ప్రక్రియ పూర్తి కావాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఏకరూప దుస్తులను నిర్ణీత సమయంలోగా అందించడానికి స్వయం సహాయక బృందాలకు పని అప్పగించామన్నారు. హైదరాబాద్ జిల్లాలో 768 పాఠశాలల్లోని 1,34,476 మంది విద్యార్థులకు యూనిఫాం అందించాల్సి ఉందని తెలిపారు. దుస్తుల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాం అందేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రోహిణి, జీహెచ్‌ఎంసీ యూసీడీ అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్, జాయింట్ కమిషనర్ ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### 9న గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలిమినరీ

జూన్ 9వ తేదీన నిర్వహించనున్న గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 77 సెంటర్లు ఏర్పాటు చేశామని, 40,569 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్ష ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించడానికి 11 మంది రూట్ ఆఫీసర్లు, 5 మంది రీజినల్ కోఆర్డినేటర్లు, 77 మంది ఇతర అధికారులు, 16 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులు, అంధ విద్యార్థుల కోసం స్క్రైబ్స్‌ను, గుర్తింపు కార్డును చూసి అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్ఓ వెంకటాచారి, జాయింట్ కస్టడియన్స్ కె.వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎం. ఫార్మసీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎం. ఫార్మసీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎం. ఫార్మసీ మొదటి, మూడో సెమిస్టర్, మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 6వ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఎం.పీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ**

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 31వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

**బీసీఏ రివాల్యుయేషన్ ఫలితాల విడుదల**

ఓయూ పరిధిలోని బీసీఏ రివాల్యుయేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. బీసీఏ సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## అరుదైన క్యాన్సర్‌ను గుర్తించిన స్టార్ హాస్పిటల్స్



జూబ్లీహిల్స్, మే 23: యాభయ్యేండ్ల ఓ మహిళ ఎండోక్రైన్ నియోప్లాసియా టైప్-2 సిండ్రోమ్‌తో దీర్ఘ కాలంగా (ఆర్థోపెడిక్ సమస్యతో) బాధపడుతున్నట్టు స్టార్ హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వైద్యులు గుర్తించారు. జన్యుపరంగా సంక్రమించే ఎంఈఎన్-2 సిండ్రోమ్ క్యాన్సర్ 20 లక్షల మందిలో ఒకరిని ప్రభావితం చేస్తుందని, ఈ తరహా క్యాన్సర్‌తో కుటుంబ సభ్యులకు ప్రమాదం ఉంటుందని సర్జికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ విపిన్ గోయల్ వెల్లడించారు.

## కంటికి రెప్పలా కాపాడారు..

జూబ్లీహిల్స్, మే 23: అతి తక్కువ బరువుతో జన్మించిన ఆదిలాబాద్‌కు చెందిన నవజాత శిశువుకు నిలోఫర్ పునర్జన్మనిచ్చింది. 560 గ్రాముల బరువుతో జన్మించిన ఈ పాపకు నియోనాటల్ యూనిట్‌లో ప్రత్యేక చికిత్స అందించారు. రెండు నెలలపాటు వైద్యబృందం ఆ చిన్నారిని కంటికి రెప్పలా కాపాడారు. దీంతో గురువారం చిన్నారిని డిశ్చార్జి చేసే సమయానికి బరువు 1.465 కిలోలకు పెరిగింది. చిన్నారికి వైద్య సేవలందించిన డాక్టర్ స్వప్న, డాక్టర్ అలిమేలు, డాక్టర్ సురేశ్‌లతో పాటు జూనియర్ డాక్టర్ల బృందాన్ని నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి అభినందించారు.



## • అంగరంగ వైభవం.. కొసగుండ్ల కల్యాణోత్సవం



నగరంలోని చైతన్యపురి - ఫణిగిరి కాలనీలోని శ్రీకొసగుండ్ల లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందుకు స్థానికంగా భక్తులు వేల సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తరించారు. ఈ ఉత్సవానికి యాదాద్రి నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు.

## భారత్, యూఎస్ ద్వైపాక్షిక వాణిజ్యం రూ.500 బిలియన్లు

**యునైటెడ్ స్టేట్స్ కౌన్సిలర్ జనరల్ జెన్నీఫర్ లార్సన్**



సదస్సులో మాట్లాడుతున్న జెన్నీఫర్ లార్సన్

ఖైరతాబాద్, మే 23: భారతదేశం, యూఎస్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రాబోవు ఐదేండ్లలో రూ.500 బిలియన్ల డాలర్లకు చేరుకోవచ్చని యునైటెడ్ స్టేట్స్ కౌన్సిలర్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని 'ది పార్క్' హోటల్‌లో 'గ్లోబల్ అలయెన్స్, స్ట్రెంథెనింగ్ ఎకనామిక్ బ్రిడ్జెస్' అనే అంశంపై గురువారం ద్వైపాక్షిక వాణిజ్య సమావేశం జరిగింది. ఎఫ్ఎల్‌వో చైర్ పర్సన్ ప్రియా గజ్దార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లార్సన్ మాట్లాడారు. అమెరికాలో చదువుతున్న భారతీయుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తున్నదని, అమెరికాలోని భారతీయ విద్యార్థుల్లో 40 శాతం తెలుగువారేనని అన్నారు. యూఎస్ఏలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భాష తెలుగేనని పేర్కొన్నారు. బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ ఓవెన్ మాట్లాడుతూ, దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక మార్పిడి మన వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు దోహదపడుతాయన్నారు. ఈటెన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషనర్ డేనీస్ మాట్లాడుతూ, గతేడాది ఆస్ట్రేలియన్ ప్రిమియర్ ఆంథోని అల్బనీస్ నేతృత్వంలోని వాణిజ్య బృందం భారత్‌కు రావడం ఎంతో కీలకమైనదన్నారు.

## ట్రాఫిక్ హోంగార్డుకు డీసీపీ రివార్డ్

**'నమస్తే తెలంగాణ' వార్తకు స్పందించిన నగర ట్రాఫిక్ డీసీపీ**



హోం గార్డు నారాయణరెడ్డికి రివార్డ్‌ను అందజేస్తున్న నగర ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, సెంట్రల్, ఈస్ట్ జోన్ డీసీపీ, ఏసీపీ, సీఐలు

కాచిగూడ, మే 23: ప్రజల మన్ననలను పొంది రివార్డులను సాధించడం అభినందనీయమని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు మీద పోగొట్టుకున్న డబ్బులున్న బ్యాగు (ఖరీదైన రెండు ఫోన్లు, ఇతర పత్రాలు) ను బాధితుడికి అందజేసి కాచిగూడ ట్రాఫిక్ హోం గార్డు ఎస్.నారాయణరెడ్డి నిజాయితీని చాటుకున్నారు. ఈ వార్త 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన నగర ట్రాఫిక్ ఇన్‌చార్జి డీసీపీ సుబ్బారాయుడు, సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ డీసీపీ అశోక్ కుమార్, ఈస్ట్ జోన్ ఏసీపీ సంపత్ కుమార్ గురువారం నగర డీసీపీ కార్యాలయంలో హోం గార్డు నారాయణరెడ్డికి రివార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది హోం గార్డు నారాయణరెడ్డిని అభినందించారు.

# పచ్చదనం పెంపుపై అధికారుల అధ్యయనం

**నగరంలో జార్ఖండ్ అధికారుల బృందం పర్యటన**



నగరంలో పర్యటిస్తున్న జార్ఖండ్ హార్టికల్చర్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం

జూబ్లీహిల్స్, మే 23: పచ్చదనం పెంపొందించడంలో గణనీయమైన ప్రగతి సాధించిన హైదరాబాద్ నగరంలో గురువారం జార్ఖండ్ హార్టికల్చర్ అధికారుల బృందం పర్యటించింది. అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపొందించేందుకు తీసుకున్న చర్యలపై అధ్యయనానికి ఐఎఫ్ఎస్ అధికారులు నగరంలోని పలు పార్కులను, లేక్‌లను సందర్శించారు. యూబీడి అడిషనల్ కమిషనర్ డాక్టర్ సునంద, డైరెక్టర్ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు జార్ఖండ్ బృందానికి గ్రేటర్‌లో చేపట్టిన గ్రీన్ ప్రాజెక్ట్‌లను వివరించారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటుచేసిన థీమ్ పార్కులు, సెంట్రల్ మీడియం, వర్టికల్ గార్డెన్స్, అవెన్యూ ప్లాంటింగ్, గ్రీన్ కర్టెన్స్, వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్‌ను అధికారులు పరిశీలించారు. గ్రేటర్ పరిధిలో పర్యటించిన ఈ బృందం చెరువులు, గ్రేవ్ యార్డులలో గ్రీనరీ పెంపుపై కూడా పూర్తిస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా తక్కువ వ్యయంతో చేపట్టిన పలు ప్రాజెక్ట్‌లపై ఆసక్తికరంగా స్పందించడంతో పాటు సంతోషం వ్యక్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో యూబీడి శేరి లింగంపల్లి డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, యూసుఫ్ గూడ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ పాష పాల్గొన్నారు.

## నేడు విత్తన మేళా

వ్యవసాయ యూనివర్సిటీ, మే 23: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, జగిత్యాల, వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలలో విత్తన మేళా ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ మేళా రోజంతా కొనసాగనున్నది. ఇందులో వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థలు ఐఐఓఆర్ , ఐఐఓఎంఆర్ , ఐఐఆర్ఆర్ , ఉద్యాన , పశువైద విశ్వవిద్యాలయం, వ్యవసాయ , ఉద్యాన అనుబంధ శాఖల ( టీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్సీ, టీఎస్ఎస్ఓ సీఏ) పాల్గొననున్నాయి. 16 రకాల పంటల్లో 67 రకాలకు చెందిన దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ మేళాల్లో సాగు సమాచారంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రదర్శనలు కూడా అందుబాటులో ఉంటాయని పరిశోధనా సంచాలకులు, రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి తెలిపారు. అంతేకాక రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి ఏర్పాటు చేయనున్నారు.

## నకిలీ విత్తనాల నివారణకు చర్యలు

మేడ్చల్, మే 23(నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాలను అరికట్టేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా విత్తన కంపెనీల్లో వ్యవసాయశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పెద్ద సంఖ్యలో విత్తన కంపెనీలు ఉన్న దృష్ట్యా అనుమానం వచ్చిన కంపెనీలపై తనిఖీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. త్వరలోనే వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు అరికట్టేలా చూస్తున్నారు. విత్తన కంపెనీలతో విత్తన ఏజెన్సీల యజమానులకు నకిలీ విత్తనాలు విక్రయించకుండా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

**తనిఖీలకు ప్రత్యేక బృందం**

వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించే తనిఖీల కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారుల సహకారంతో విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందంగా ఏర్పాటు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనుమానం వచ్చినా, ఎవరైనా సమాచారం ఇచ్చినా ఈ బృందం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించనున్నది. నకిలీ విత్తనాలు తరలకుండా ఉండేలా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

**రసీదు తీసుకోవాలి**

వివిధ పంటలకు సంబంధించి విత్తనాలను కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. ఇలా చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. నకిలీ విత్తనాలు విక్రయించే వారు రసీదు ఇవ్వరు. గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

**- మేరీ రేఖ, జిల్లా వ్యవసాయాధికారి**

## ఐఏడీవీఎల్‌కు గిన్నిస్ బుక్ రికార్డు ప్రదానం

బన్సీలాల్‌పేట్, మే 23: చర్మవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించిన అంశం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిందని గాంధీ దవాఖాన డెర్మటాలజీ వైద్యుడు, ఐఏడీవీఎల్ సెక్రెటరీ జనరల్ డాక్టర్ కటకం భూమేశ్ కుమార్ తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలాజిస్ట్స్, వెనిరిలాజిస్ట్స్, లెప్రలాజిస్ట్స్ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన 24 గంటల పాటు నాన్ స్టాప్‌గా దేశ వ్యాప్తంగా చర్మవ్యాధులపై 9,405 డాక్టర్లకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించామని ఆయన అన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి ప్రపంచ రికార్డుగా గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి రిషినాథ్ ఈ నెల 18న న్యూఢిల్లీలోని ఐఏడీవీఎల్ కార్యాలయంలో తమ సంస్థకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందించారని ఆయన తెలిపారు. చర్మ ఆరోగ్యం, చర్మ సంబంధిత వ్యాధులు, రుగ్మతలపై దేశ వ్యాప్తంగా అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన భారతదేశాన్ని ఆవిష్కరించడానికి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఐఏడీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షెనాయ్, ప్రతినిధులు రాజీవ్ శర్మ, విజయ్ జవార్, కవిత, వికాస్ శంకర్‌లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.



గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్న డాక్టర్ భూమేశ్ కుమార్

# గ్రేటర్‌లో సాహసించే వారేరీ?

**ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు నిల్**

**సవాల్‌గా మారిన ఎకరం స్థలం**

**జూన్ 1 నుంచి ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్స్ నిబంధనలు అమల్లోకి..**

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): గ్రేటర్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్స్ రావడం కష్టంగానే కనిపిస్తుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటుకు జూన్ 1 నుంచి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండేండ్ల కిందటనే కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ, స్కూళ్ల ఏర్పాటుకు అప్పట్నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కారణం ఎకరం స్థలంలో స్కూల్ ఏర్పాటు చేయాలని సూచించడం ఇప్పుడు అసలైన సవాల్‌గా ఏర్పడింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో ఎకరం స్థలం అంటే కోట్ల రూపాయల్లో మాట. లీజుకు తీసుకోవాలనుకున్న కోటి దాటుతుంది. ఇక పెద్ద వాహనాలకు శిక్షణ అంటే రెండెకరాల స్థలం ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో గ్రేటర్ జిల్లాలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కత్తి మీద సాములాంటిదేనని నిపుణులు చెబుతున్నారు. రవాణా శాఖ ఇప్పటికే దరఖాస్తు చేసుకోవాలని సూచించినా, ఒక్క దరఖాస్తు కూడా రాలేదని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్నాక కమిషనర్ కార్యాలయం పరిశీలించి నిబంధనల ప్రకారం, అనుమతుల ఇస్తుందని ఆయన తెలిపారు. కానీ, ఇప్పటికీ ఎవ్వరూ ముందుకు రావడం లేదని చెప్పారు.

**ఇప్పటి వరకు లైసెన్స్ జారీ ఇలా..!**

సాధారణంగా డ్రైవింగ్ లైసెన్సు కావాలంటే ఏం చేస్తాం?! ముందుగా ఒక ప్రైవేటు డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లి శిక్షణ తీసుకుంటాం. ఆపై మరి కొన్ని రోజులు సొంత వాహనాలతో కుస్తీ పడతాం. ఆ తర్వాత పూర్తిస్థాయి నమ్మకం వస్తే డ్రైవింగ్ లైసెన్సుపై దృష్టి సారిస్తాం. అప్పటికే లెర్నింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకొని ఉంటే, స్లాట్ బుక్ చేసుకొని డ్రైవింగ్ పరీక్షకు వెళతాం. లేకపోతే లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసిన తర్వాత డ్రైవింగ్ పరీక్షకు సిద్ధపడతాం. మరి... రవాణా శాఖ ఏర్పాటు చేసే టెస్టింగ్ ట్రాక్‌లపై వాహనాన్ని నడిపి.., ఒకవేళ విఫలమైతే మరోసారి పకడ్బందీగా నేర్చుకొని మళ్లీ వెళతాం. ఇదీ... ఇప్పటివరకు డ్రైవింగ్ లెసెన్సు పొందే విధానం.



**అవగాహన లేకనే ప్రమాదాలు..!**

సాధారణంగా ఇప్పటి వరకు ఉన్న డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో అత్యధిక భాగం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించకుండానే శిక్షణ కాలాన్ని పూర్తి చేస్తున్నారు. మొదటి రోజు నుంచే నేరుగా స్టీరింగ్ ఇవ్వడం.., రద్దీ ఉన్న రహదారులపై తిప్పడం ఇప్పుడున్న ప్రైవేటు కేంద్రాల విధానంగా ఉంది. పైగా రోజుకు గంట, గంటన్నర మాత్రమే సమయాన్ని కేటాయించి, పది, పదిహేను రోజుల్లోనే శిక్షణ పూర్తి చేస్తున్నారు. ఇందుకు రూ.3-5 వేల వరకు వసూలు చేస్తారు. దీంతో చాలామంది వీటిని ఆశ్రయించి, కేవలం పది, పదిహేను రోజుల్లోనే సొంతంగా వాహనాలను నడుపుతున్నారు. ఇలా నాణ్యమైన శిక్షణ లేకపోవడం ఒకవంతైతే.., ఎక్కడా కూడా ట్రాఫిక్ నిబంధనలు, వాటిపై అవగాహన అనేది కనిపించదు. ఈ క్రమంలోనే చాలా రోడ్డు ప్రమాదాలకు నాణ్యమైన శిక్షణ లేకపోవడమే కారణంగా వెల్లడవుతుంది.

**శిక్షణకు స్కూల్స్..!**

సాధారణంగా ప్రైవేట్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో అధునాతన సౌకర్యాలతో నాణ్యమైన శిక్షణ లభించేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. శిక్షణలో భాగంగా తొలుత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన (థియరీ) కల్పిస్తారు. ఆ తర్వాత ఇండోర్‌లో సిమిలేటర్స్ ఇచ్చి స్టీరింగ్ నిర్వహణ, మార్జిన్ ఎలా ఉండాలనేది నేర్పిస్తారు. అనంతరమే వాహనాల స్టీరింగ్‌ను ఇచ్చి ట్రాక్‌లపై డ్రైవింగ్ శిక్షణ మొదలవుతుంది. ట్రాక్ నిర్మాణం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేలా పెయింటింగ్ వేయనున్నారు. ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్సు పరీక్షకు వెళ్లినపుడు వాహనాన్ని నడిపే యూ, ఎస్, ఎనిమిది తదితర ఆకారంలో ఉండే ట్రాక్‌లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన వస్తుంది. దీంతో ఇక ప్రత్యేకంగా ఆర్టీఏ కార్యాలయాల పరిధిలోని డ్రైవింగ్ ట్రాక్‌లకు వెళ్లే పరీక్షలు లేకుండానే నేరుగా డ్రైవింగ్ లైసెన్సు జారీ చేయనున్నారు.

## ప్రథమ్ ఇండియాతో జతకట్టిన సీసీఎంబీ

**శాస్త్ర, సాంకేతిక పరిశోధనలపై గ్రామీణ ప్రాంతాలకు అవగాహన**

సిటీబ్యూరో, మే 23(నమస్తే తెలంగాణ): శాస్త్ర, సాంకేతిక పరిశోధనల ప్రాధాన్యతను పెంచేలా సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ కీలక నిర్ణయం తీసుకున్నది. బయాలజీ అధ్యయనంలో ముఖ్య భూమికను పోషిస్తున్న సీసీఎంబీ, డీఎన్ఏ, ప్లాంట్, సెల్ డేటాజ్‌తో పాటు అంతరించిపోతున్న జీవరాసులను పరిరక్షించేలా అధ్యయనాలు చేస్తోంది. ఈ క్రమం లో సీసీఎంబీ చేసే పరిశోధనలు, అధ్యయనాలకు విస్తృత ప్రాచుర్యం కలిగించి మారుమూల ప్రాంతాల్లోనూ శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన, ఆసక్తిని పెంచేలా కృషి చేస్తోంది. ఇందుకు ప్రథమ్ ఇండియాతో సీసీఎంబీ ఒప్పందం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాలకు పరిశోధనలను వివరిస్తూ చిన్నారుల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో ప్రథమ్ ఫౌండేషన్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు సీసీఎంబీ చేసే పరిశోధనలు, అధ్యయనాలను ఆడియో, వీడియో రూపంలో వివరంగా తెలుసుకునే అవకాశం ఉం టుందని సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ప్రథమ్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదిరినట్లుగా సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి.